క్లుప్తంగా

క్రీడా పరికరాల అందజేత

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రీడా పరికరాలు ఉచితంగా అందజేశారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరికరాలను వారికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి, మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, యూత్ అధ్యక్షుడు ఆకబోయిన శ్రీనివాస్, నాయకులు సీతారం మధు, రామస్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

మాచారెడ్డి(కామారెడ్డి): మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం నిజామాబాద్ ప్రజారోగ్య డిప్యూటీ ఇంజినీర్ మద్దగారి నాగేష్ రెడ్డి రూ.25 వేలు విరాళంగా ఛైర్మన్ కమలాకర్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంతోష్, చుక్కాపూర్ గ్రామస్తుడు గాల్ రెడ్డి, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న స్వీపర్ల దీక్షలు

కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న స్వీపర్ల డిమాండ్లను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె 37వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సత్యం వారికి మద్దతు పలికి మాట్లాడారు.

టీచర్ల తొలిమెట్టు సమావేశం

దోమకొండ: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయులు తొలిమెట్టు సమావేశం నిర్వహించారు. ఎంఈవో ఎల్లయ్య ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వారి సామర్థ్యాలపై వివరాలు సేకరించారు. బుధవారం నుంచి ఈ నెల 8 వరకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు నరేష్, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్ స్టేజీ వద్ద గల జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం పాత పెన్షన్ సంకల్పయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఎస్ సీపీఎస్ఈయూ మండలాధ్యక్షుడు క్రిష్ణాకర్ రావు మాట్లాడుతూ...ఈ నెల 12న ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టే పోరాటంలో ప్రతి ఒక్క ఉద్యోగి పాల్గొనాలని కోరారు. ప్రతినిధులు బాల్‌కిషన్ రావు, లింగం, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పరేడ్ పల్లి గ్రామ పంచాయతీ రికార్డులను ఎంపీవో సూర్యకాంత్ పరిశీలించారు. పలు సూచనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ..

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీపీ అశోక్ పటేల్ పరిశీలించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లి పాలపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు.

గ్రామ పంచాయతీ రికార్డులు..

బిచ్కుంద(జుక్కల్): కందర్‌పల్లి గ్రామ పంచాయతీని మంగళవారం ఎంపీవో మహిబుబ్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేయించాలని కార్యదర్శిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, ట్యాంకులు బ్లీచింగ్‌తో శుభ్రం చేసి క్లోరినేషన్ నీటిని ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

దోమకొండ: దోమకొండ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్ సందర్శించారు. శాంతి భద్రతల్లో భాగంగా నేరాల నియంత్రణ, సైబర్ క్రైమ్‌లపై నియంత్రణ, రోడ్డు భద్రత, రాత్రి సమయంలో గస్తీ నిర్వహణపై సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భిక్కనూర్ సీఐ తిరపయ్య, ఎస్సై మురళి, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మొగి పురుగు నివారించాలి

నిజాంసాగర్(జుక్కల్): మొగిపురుగు నివారణకు సరైన పురుగు మందులు పిచికారీ చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్ కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మంగ్లూర్ శివారులో సాగు చేస్తున్న వరి పంట పొలాలను అధికారులు పరిశీలించారు. ముందుగా సాగు చేసిన వరి పైర్లను మొగిపురుగు వెంటాడుతుందన్నారు. నివారణకు క్లోరిపైరిపాస్, కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్, 4జీ లేదా 10జీ గుళికలను వాడాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్ ఉన్నారు.

పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని జంగమాయిపల్లి, మల్లయ్యపల్లి గ్రామాలలో వైద్య శిబిరాలను నిర్వహించినట్లు మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శరత్ తెలిపారు. అలాగే ఉచితంగా మందులను అందించినట్లు ఆయన చెప్పారు. ఆరోగ్య సిబ్బంది శారత, సాయవ్వ తదితరులున్నారు.

అన్నాబావూ సాఠే అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్యే హన్మంత్ సింధే
- ఘనంగా అన్నా జయంతి



పెద్దకొడప్‌గల్‌లో .. ఎమ్మార్పీఎస్ నేతలు



మద్నూర్‌లో అన్నాబావూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

మద్నూర్(జుక్కల్): అన్నాబావూసాఠే ప్రతి ఒక్కరికి ఆదర్శమని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అన్నబావూసాఠే విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఎగురవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అన్నాబావు సాఠే చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రతి ఒక్క యువకుడు ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. సర్పంచ్ సురేష్, ఎంపీపీ లక్ష్మీబాయి, జెడ్పీటీసీ అనిత, మద్నూర్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు బస్వీపటేల్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో సాహిత్య రత్నలోక్ షహీర్ డాక్టర్ అన్నా బావూ సాఠే 103వ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు రుశేగం భూమయ్య మాదిగ మాట్లాడుతూ.. అన్నా బావూ సాఠే ఎన్నో కష్టాలు ఎదిరించి దళితుల పక్కన నిలిచారని, ఆయన మార్గంలో అందరూ నడవాలని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సర్గళ్ల రవీందర్ మాదిగ ఉపాధ్యక్షులు బలరాం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం ఆస్పత్రిలో వసతుల లేమి



సెల్‌ఫోన్ లైట్ వేసి వైద్యం చేస్తున్న సిబ్బంది

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు కరువయ్యాయి. రాత్రి సమయంలో వైద్యులు ఉండకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని కాస్లాబాద్ గ్రామానికి చెందిన మహేందర్ పిట్లం నుంచి తన గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా జాతీయ రహదారిపై ధర్మారం టోల్ ప్లాజా వద్ద ప్రమాదవశాత్తూ కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో గాయపడిన మహేందర్‌ను చికిత్స నిమిత్తం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికు తరలించారు. ఆస్పత్రిలో సరైన లైట్లు కూడా లేకపోవడంతో ఆస్పత్రి అటెండర్ సెల్‌ఫోన్ లైట్లు వేసి క్షతగాత్రుడి గాయాలకు డ్రెసింగ్ చేశారు. వైద్యాధికారులు లేకపోవడంతో ఏఎన్ఎం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరిస్థితి ప్రస్తుతం పిట్లం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వసతులు కల్పించి, రాత్రి సమయంలో ఒక వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



దోంగ్లీ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న శోభారాజ్

మద్నూర్(జుక్కల్): మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాజ్ సూచించారు. డోంగ్లీ పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. డోంగ్లీ పీహెచ్‌సీలో కొనసాగుతున్న ఆరోగ్య మహిళ క్యాంపును ఆమె పరిశీలించారు. మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంప్‌ను ప్రత్యేకంగా డోంగ్లీ పీహెచ్‌సీ నిర్వహిస్తోందని ఆమె పేర్కొన్నారు. మహిళలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా వారిని పరీక్షించి మందులు అందిస్తామని మెరుగైన వైద్యం కోసం పట్టణ ఆస్పత్రులకు రిఫర్ చేస్తామని అన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కామారెడ్డి రూరల్: లింగాపూర్ అంగన్వాడీ కేంద్రం-7లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లి పాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ వైద్య ఉమా రాణి తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. డాక్టర్ బాలకృష్ణ, ఆశావర్కర్ పి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బాన్సువాడ రూరల్: చిన్నారుల కోసం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందచేస్తున్న పౌష్టిహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపేట్ గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి కోరారు. గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం అంగన్‌వాడీ టీచర్ శివగంగతో కలిసి చిన్నారుల ఎత్తు, బరువు సరిచూశారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలోని అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నారులకు, బాలింతలకు సర్పంచులు పౌష్టికాహారాన్ని అందించారు. తిమ్మారెడ్డి అంగన్‌వాడి కేంద్రంలో బాలింతలకు గుడ్లను సర్పంచ్ అబ్దుల్ అలీ మహ్మద్ పంపిణీ చేశారు.

జయప్రదం చేయాలి



కామారెడ్డి టౌన్: ఈ నెల 7న తిరుపతిలో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 8వ మహాసభ వాల్ పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆవిష్కరించారు. జిల్లాలోని బీసీ సంఘాల ప్రతినిధులు ఈ మహాసభకు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజ్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు ఉన్నారు.

కొనసాగుతున్న 'గాలికుంటు' టీకాల శిబిరాలు



సాక్షి నెట్‌వర్క్ : గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. సోమవారం పలు చోట్ల పశువులకు టీకాలు వేసి శిబిరాలను పశువైద్యులు ప్రారంభించారు. వర్షాకాలం సీజన్‌లో వచ్చే వైరస్ ఎఫ్ఎండీ నుంచి కాపాడుకోవడానికి 3 నెలలు పైబడిన దూడలకు, చూలు కట్టిన, పాలు ఇచ్చే అన్ని పశువులకు ఈ టీకాలు వేయించుకోవాలని వైద్యులు తెలిపారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్టీసీ విలీనం హర్షణీయం



బాన్సువాడ/పిట్లం/కామారెడ్డి టౌన్ : ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో మంగళవారం ఆర్టీసీ బస్‌డిపోల వద్ద కార్మికులు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కేబినేట్ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 43 వేల కార్మికుల శ్రమకు ఫలితం దక్కిందన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో కార్మికుల జీవితాల్లో వెలుగులు వచ్చాయని అన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



బాన్సువాడ: మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మిషన్ భగీరథ ఏఈకి సీఐటీయు జిల్లా నాయకులు ఖలీల్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ.. జీవో-11, 60 లను అమలు చేయాలని, మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికుల వేతనాల పెంచాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. కార్మికులు రూప్‌సింగ్, పండరి, బాల్‌రాజ్, మొగులయ్య, అంబర్‌సింగ్ ఉన్నారు.

ఘనంగా మదన్ మోహన్ రావు జన్మదిన వేడుకలు



మదన్‌మోహన్‌కు కేక్ తినిపిస్తున్న కాంగ్రెస్ నేతలు



ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తూ..

ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట : టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఐటీ సెల్ చైర్మన్ మదన్ మోహన్ రావు జన్మదిన వేడుకలు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్, మదన్‌మోహన్ యూత్ ఆధ్వర్యంలో అభిమానులు, పార్టీ కార్యకర్తలు రక్తదానం చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు అందించారు. బర్త్‌డే కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

పీజేఆర్ కళాశాలకు ఎన్ఎస్ఎస్ యూనిట్ మంజూరు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పీజేఆర్ స్ఫూర్తి కళాశాలకు ఎన్ఎస్ఎస్ యూనిట్ మంజూరైనట్లు కళాశాల చైర్మన్ గురువేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి నుంచి ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కనకయ్య తదితరులున్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



రాజంపేట/భిక్కనూరు/బీబీపేట : రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె మంగళవారం 27వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కార్మికులు పలు చోట్ల వినూత్నంగా నిరసన తెలిపారు. కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

రాగి జావ పంపిణీ ప్రారంభం

మాచారెడ్డి/బాన్సువాడ రూరల్/కామారెడ్డి రూరల్ : బాన్సువాడ మండలం కోనాపూర్, మాచారెడ్డి మండలం అక్కాపూర్, కామారెడ్డి మండలం సరంపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. విద్యార్థుల్లో ఐరన్ లోపం లేకుండా ఉండటానికి ప్రభుత్వం రాగిజావ పంపిణీ ప్రారంభించిందని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు తెలిపారు.



కనీస వేతనాలు అమలు చేయాలి



కామారెడ్డి టౌన్: కేజీబీవీలో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 4న హైదరాబాద్‌లో కార్మిక గర్జన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని కేజీబీవీలో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వాణి, శిరీష పాల్గొన్నారు.

తప్పుడు విమర్శలు మానుకోవాలని హితవు



బీబీపేటలో మాట్లాడుతున్న సుతారి రమేశ్

బీబీపేట: కాంగ్రెస్ పార్టీపై చేస్తున్న తప్పుడు విమర్శలు మానుకోవాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్‌ను ఉద్దేశించి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. షబ్బీర్ అలీ దళితులపై చిన్నచూపు చూస్తున్నారని మాట్లాడిన ప్రేమ్‌కుమార్ నువ్వు బీఆర్ఎస్ పార్టీలో ఉండి ఎంత మంది దళితులకు న్యాయం చేశావని ప్రశ్నించారు. జనగామ సర్పంచ్ రాజును బీఆర్ఎస్ ఎమ్మెల్యే సస్పెండ్ చేసినపుడు ఒక దళితుడిగా సర్పంచుకు ఎందుకు మద్దతుగా ఉండలేదని ప్రశ్నించారు. జనగామ సర్పంచ్ పాత రాజు, సలీం, రమేష్, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన



గాంధారిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



సదాశివనగర్ జూనియర్ కళాశాలలో..

గాంధారి(ఎల్లారెడ్డి): సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సతీష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయితీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఎంపీవో రాజ్‌కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ సీహెచ్‌వో నాగరాజు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాలల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రిన్సిపాల్ అజ్మల్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కామారెడ్డి రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం క్యాసంపల్లి, క్యాసంపల్లి తండా, రాఘవపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా క్యాసంపల్లిలో మురికి కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్, దోమల మందును పిచికారి చేయించారు. ఆయన వెంట సర్పంచ్‌లు సందిరి మంజుల, మీరి, సాగర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సాయం అందజేస్తున్న ఎన్ఆర్ఐ ఆంజనేయులు

రాజంపేట: మండల కేంద్రానికి చెందిన సాదుల దుర్గవ్వ రెండు రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయింది. దుర్గవ్వ కూతురు, ఇద్దరు కుమారులు మూగవారు, వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. దుర్గవ్వ మరణవార్తను స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎన్ఆర్ఐ బల్ల ఆంజనేయులు, కుమారుడు సాయిలు వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. దీంతో వారి కుటుంబానికి మంగళవారం స్థానిక మాజీ ఎంపీటీసీ చేతుల మీదుగా వారి కుటుంబానికి రూ. 10 వేల రూపాయలను అందజేశారు.

ఫొటోగ్రాఫర్‌కు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజివాడి చౌరస్తాకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ తుమ్మ సాయిబాబాకు ఫొటోగ్రాఫర్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. సాయిబాబా అనారోగ్యం బాధపడుతున్నట్లు ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు దీకొండ శ్రీధర్ తెలిపారు. జిల్లా బాధ్యులు శ్రీనివాస్, నవీన్, భూపాల్, ఆశన్న, తదితరులున్నారు.

ఇళ్లు కూలిన బాధితులకు..

బాన్సువాడ: ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కూలిన బాధితులకు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కాసుల రోహిత్ ఆర్థిక సహాయం చేశారు. బీర్కూర్ మండలం అన్నారంలో గుత్తి మల్లుగొండకు రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు బోయిన శంకర్, గణేష్, దొంతురాం కాశీరాం తదితరులు ఉన్నారు.

సహకార సంఘ సభ్యుల కుటుంబాలకు..

భిక్కనూరు: సహకార సంఘంలో సభ్యులుగా ఉండి చనిపోయిన సభ్యులు మానుకొండ సిద్దయ్య, శ్రీరాం బాలయ్య, బత్తిని సిద్దరాములు, బండి నారాయణల కుటుంబాలకు రూ.3 వేల చొప్పున సొసైటీ చైర్మన్ గంగల భూమయ్య ఆధ్వర్యంలో అందజేశారు. వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, నర్సింలు ఉన్నారు.

సంక్షిప్తం

చికెన్ సెంటర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ చికెన్ సెంటర్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా ఎండీ ఇషాద్, ఉపాధ్యక్షులుగా మన్మోహన్ రెడ్డి, కుర్రం అలీ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ నాజిత్, కోశాధికారిగా దిలీప్ రెడ్డి, ముషీబ్ ఖాన్, సభ్యులుగా సతీష్, నిజాముద్దీన్, తదితరులను ఎన్నుకున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డి: లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన బండారి మహేష్‌కు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను అందించినట్లు ఎస్సై గణేష్ మంగళవారం తెలిపారు. ఈ నెల 16న మహేష్ ఎల్లారెడ్డిలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవడంతో ట్రాక్ చేసి అందించారు.

వీఆర్ఏల సర్టిఫికెట్ల పరిశీలన

భిక్కనూరు: వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వీఆర్ఏల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏల పుట్టిన తేదీ, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు.

నాగ్లూర్ శివారులో పంటలు..

గాంధారి(ఎల్లారెడ్డి): నాగ్లూర్ శివారులో మంగళవారం ఏవో నరేష్ పర్యటించారు. క్షేత్ర స్థాయిలో సోయాబీన్, మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. అధిక వర్షాల కారణంగా పంటలు పెరగడంలేదన్నారు. పంట పొలాల్లో వర్షపు నీరు నిలువ ఉన్నందున పంటలు పసుపు పచ్చగా మారాయని రైతులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చినట్లు తెలిపారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కామారెడ్డి టౌన్: మంత్రివర్గ సమావేశంలో బీడీ టేకేదార్‌లకు సైతం జీవన భృతి రూ.2016 ఇస్తామని సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.

99వ రోజుకు చేరిన దీక్షలు

భిక్కనూరు : ఫ్యాక్టరీల కాలుష్యంపై కాచాపూర్ వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం 99వ రోజుకు చేరాయి. ప్రభుత్వం ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకునేవరకు ఆందోళనలు కొనసాగుతాయని గ్రామస్తులు స్పష్టం చేశారు.

బాలగంగాధర్ తిలక్‌కు నివాళి

కామారెడ్డి అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు లోకమాన్య బాల గంగాధర్ తిలక్ వర్ధంతి సందర్భంగా మంగళవారం గ్రంథాలయ సంస్థలో జిల్లా చైర్మన్ పి.రాజేశ్వర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల పంపిణీ

కామారెడ్డి టౌన్: కామారెడి ఆర్టీసీ డిపోలో తాడ్వాయి మండలంలో చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 4 వేల మందికి ఉచితంగా ఆర్టీసీ బస్ పాస్‌లను మంగళవారం పంపిణీ చేశారు. దేవాయిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి సౌజన్యంతో ఈ పాసులను విద్యార్థులకు అందజేసినట్లు ఆర్టీసీ డీఎం లక్కు మల్లేశం తెలిపారు.

హైదరాబాద్‌కు తరలివెళ్లిన ఏబీవీపీ నేతలు

భిక్కనూరు: తెలంగాణలో మార్పు కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో చేపట్టిన బహిరంగ సభకు భిక్కనూరు మండలం నుంచి వంద మంది విద్యార్థులు తరలివెళ్లారు. సంజయ్, సమీర్‌ఖాన్, చందు, శివకృష్ణ ఉన్నారు.